

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 23.0

భక్తిశ్రద్ధలతో రంజాన్ : జిల్లాలో రంజాన్‌ను గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిత్రంలో ఏలూరు పాత బస్టాండ్ కర్బలా మైదానంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు.



ఎన్నికల అటెన్షన్!



ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదల కాబోతుంది. ఆ రోజునుంచే నామినేషన్ ప్రక్రియ ఆరంభం కానుంది. ఈలోపే ఎన్నికల నిర్వహణకు వీలుగా అధికారులు చకచకా ఏర్పాట్లకు దిగారు. నగదు, మద్యం, పెద్దఎత్తున సీజ్ చేశారు. కీలక ప్రాంతాల్లో చెక్ పోస్టులతో నిఘా పెంచారు. పోలింగ్ కేంద్రా లు, కౌంటింగ్ కేంద్రాలను దశల వారీగా పరిశీలిస్తున్నారు. పోలింగ్ నిర్వహణ సిబ్బంది నియామకం పూర్తి కావొచ్చింది. మొత్తం మీద ఎన్నికలు నిర్వహణ పైనే యంత్రాంగం యావత్తు మోహరించింది. మరోవైపు రాజకీయ పార్టీలు ప్రచారాలతో పాటు ఏజెంట్ల నియామకం, ఓట్ల జాబితాల పరిశీలనలో తలమునకలై ఉన్నాయి.

- ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

అధికారులు.. పార్టీలు సమాయత్తం

- ఈ నెల 18న నోటిఫికేషన్.. ఆ వెంటనే నామినేషన్లు ఆరంభం
- పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలు సిద్ధం
- ఆ దిశగానే అన్నిచోట్ల ఏర్పాట్లు ముమ్మరం
- ఎన్నికల సిబ్బంది నియామకం పూర్తి
- ఏజెంట్ల నియామకానికి అన్ని పార్టీలు సిద్ధం

ఎన్నికల తరుణంలో ఎక్కడచూసినా నగదు, మద్యం పట్టుబడుతున్నాయి. ఇప్పటికే నిఘా పెంచి తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లాలోనే రూ.12 కోట్ల విలువైన నగదు, మద్యం, బంగారపు వస్తువులు సీజ్ చేశారు. ఆర్టీసీ కార్గోలో లక్షల లక్షల నగదు వచ్చి పడింది. దీన్ని ఎన్నికల అధికారులు వదల్లేదు. ముందస్తు సమాచారంతో సీజ్ చేశారు. తెలంగాణ సరిహద్దులు దాటి వచ్చిపడుతున్న మద్యంపైనా ఓ కన్నేసి ఉంచారు. అన్ని మార్గాల్లోనూ ఆకస్మిక తనిఖీలు, నిరంతర చెక్ పోస్టులలో తనిఖీలు సాగుతూనే ఉన్నాయి. నగదుకు సంబంధించే దాదాపు రూ.కోటిన్నర సీజ్ అయింది. మరో రూ.71 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. బంగారం ఇతరత్రా వస్తువులు విలువ కలిపి షెడ్యూల్ విడుదలైన తర్వాత నేటివరకు రూ.12 కోట్లు దాటేసింది. ఎక్కువగా ఎన్నికల నియమావళి తెలియని గ్రామీణుల వద్దే నగదు దొరుకుతోంది. జిల్లాలో అత్యల్పంగా రూ.78 వేల నుంచి అత్యధికంగా రూ.24 లక్షల వరకు నగదు స్వాధీనం అయింది. ఎన్నికల సీజన్ కాబట్టి మద్యానికి మంచి డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీలతో పాటు కొందరు దళారులు మద్యాన్ని పెద్దఎత్తున నిల్వ చేస్తున్నట్టు అనుమానిస్తున్నారు. దీన్ని ఛేదించేందుకు యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఓ రాజకీయ పార్టీ పెద్దఎత్తున తమ అనుచరుల చేతికి నగదు అందించినట్టు ప్రచారం సాగుతోంది. కోట్ల లో లావాదేవీలకు వీరందరూ సిద్ధపడుతున్నట్టు మరో ప్రచారం ఉంది.

కొత్త ఓటర్ల చేరిక

ఎన్నికలు సమీపిస్తున్న వేళకూడా, కొత్త ఓటర్లను జాబితాలో చేర్చుకునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఏలూరు జిల్లా పరిధిలో దాదాపు 21 లక్షల మంది జనాభా ఉండగా, వీరిలో 16,25,000 మందికి పైగా ఓటర్లే ఉన్నారు. వీరికి తోడు కొత్త ఓటర్ల సంఖ్య త్వరలోనే పెరగనుంది. చేరికలు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి వాటి విషయంలో యంత్రాంగం జాగ్రత్త పడుతోంది. వివిధ రాజకీయ పక్షాలు అన్ని ఓటర్ల జాబితాతో స్థానికంగా సరిపోల్చుకుంటున్నాయి.

పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో..

ఎన్నికల నిర్వహణ అంటే సాధారణ బాధ్యతే కాదు. ఉమ్మడి బాధ్యత. ఈ దిశగా అధికార యంత్రాంగం నిర్వహణ ఏర్పాట్లలో తలమునకలై ఉంది. ఇప్పటికే రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, వాటి నిర్వహణపై ముందస్తుగా వివరాలు అందించారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ, వైసీపీ, వామపక్షాలు కాంగ్రెస్‌తో సహా అన్నిపార్టీలు ఈ అంశాల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,743 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వీటి నిర్వహణ పోలింగ్ నాడు అవసరమైన ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులంతా ఇప్పటికే ప్రత్యేక పరిశీలన చేశారు. ఎక్కడెక్కడ లోటుపాట్లు ఉన్నది గమనించి దిద్దుబాటు చర్యలకు దిగారు. కౌంటింగ్ వచ్చేసరికి ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను ఎంపిక చేశారు. ఇదే కేంద్రంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగబోతోంది. ఈనెల 18 తర్వాత 25వ తేదీ వరకు నామినేషన్ల పర్వం ఆరంభం కానుంది. ఇప్పటికే గుర్తించిన కేంద్రాల్లో నామినేషన్ స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎంపీ అభ్యర్థుల నామినేషన్‌లను కలెక్టరేట్‌లోనూ, అసెంబ్లీ నియోజకవర్గాల నామినేషన్‌లను ఇప్పటికే గుర్తించిన నియోజకవర్గ కేంద్రాల్లోనూ స్వీకరిస్తారు. ప్రత్యేకించి ఎన్నికల సిబ్బంది, ఎన్నికల నిర్వహణకు వీలుగా దాదాపు 10 వేల మందికి పైగా సిబ్బందిని నియామకం చేశారు.

పార్టీల సంగతేంటి!

తెలుగుదేశం కూటమితో సహా అధికార వైసీపీ, ఇతర పార్టీలు అన్ని పోలింగ్ నాడు అవసరమైన ఏజెంట్ల జాబితాలను ఇప్పటికే సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రత్యేకించి కీలక ప్రాంతాల్లో తమకు విశ్వాసమైన వ్యక్తు లు ఏజెంట్లుగా కొనసాగేలా జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశానికి కొన్ని గుణపాఠా లున్నాయి. అప్పట్లో ఎన్నికల పోలింగ్‌నాడు కౌంటింగ్ సమయంలోనూ చాలా నియోజకవర్గాల్లో టీడీపీ ఏజెం ట్లు ముందస్తుగానే బయటకు వెళ్ళిపోయారు. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి ఆ పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్తలు పడుతున్నారు. వైసీపీ ఎత్తుగడలను ముందే గమనించి ఎక్కడైనా ఆటంకాలు ఉల్లంఘన జరిగితే ఫిర్యాదుకు సమాయత్తం అవుతు న్నారు.

అత్యవసర అడ్మిషన్ కష్టమే..!

ఏలూరు ఆస్పత్రి అత్యవసర విభాగం అడ్మిషన్ కౌంటర్ సిబ్బంది తీరుపై విమర్శలు



గురువారం మధ్యాహ్నం అత్యవసర విభాగం వద్ద అడ్మిషన్ కౌంటర్‌లో ఎవరు లేని దృశ్యం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అత్యవసర విభాగానికి రోడ్డు ప్రమాదాలు, పురుగుల మందు తాగిన వారు, పాము కాట్లు, గర్భిణులు వంటి అత్యవసర కేసులు వస్తూ ఉంటాయి. డ్యూటీ వైద్యులు పరీక్షించి సంబంధిత వార్డులకు అడ్మిట్ అవ్వాలని రాస్తూ ఉంటారు. దీనికి పేషెంట్ అడ్మిట్ పే షీట్లను రాయించుకోవాలి. ఇందుకోసం మూడు షిఫ్టులుగా ఇక్కడ క్లాస్ ఫోర్ ఉద్యోగులు డ్యూటీలు మారుతూ ఉంటారు. అడ్మిషన్ విభాగం వద్దకే షీటు రాసిన తర్వాతే వార్డుకు పేషెంటును తీసుకెళ్లితే అత్యవసర వైద్య సేవలు అందిస్తారు. అయితే గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటల వరకు అక్కడ ఒక్క ఉద్యోగి కూడా లేకపోవడంతో రోగుల బంధువులు ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదు. దీంతో ఛాతీ నొప్పితో వచ్చిన ఒక పేషెంట్‌తో పాటు మరో ముగ్గురిని బంధువులు ప్రైవేటు ఆస్పత్రులను తరలించారు చివరకు సాయంత్రం 4 గంటలకు క్లాస్‌ఫోర్ ఉద్యోగిని పంపించారు. అప్పటికే చాలామంది వెనుదిరిగి వెళ్లిపోయారు. ఉన్న వారిని అడ్మిట్ చేశారు. కొన్ని విభాగాల్లో కొంత మంది క్లాస్ ఫోర్ ఉద్యోగులు ఖాళీగానే ఉంటున్నారు. సమన్వయ లోపం కారణంగానే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. కొద్ది రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని, రాత్రి వేళ్లలో ఈ విభాగంలో ఒక ఉద్యోగి కనిపించడని తెల్లవారే వరకు అత్యవసర విభాగంలోనే అడ్మిషన్ల కోసం పడిగాపులు పడుతున్నారని కొంతమంది సిబ్బందే చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అత్యవసర విభాగంలోని అడ్మిషన్ కౌంటర్‌ను ప్రక్షాళన చేసి సత్వర సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కాల్వగట్లపై మహిళా ఉద్యోగుల పాట్లు

ముదినేపల్లి, ఏప్రిల్ 11 : కాల్వలకు విడుదల చేసిన నీటిని చేపలు, రొయ్యల చెరువులకు మళ్లించకుండా చూసేందుకు అధికారులు ఏర్పాటు చేసిన టీముల్లో గ్రామ సచివాలయాల మహిళా ఉద్యోగులను నియమించడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వలపై ఏర్పాటు చేసిన పాయింట్ల వద్ద ఒక్కో ఉద్యోగినినే నియమించడం ఇబ్బందులు కలిగిస్తోంది. మండలంలోని పోల్ రాజ్, క్యాంప్ బెల్ బీఎండీ కాల్వలపై రెండు కిలోమీటర్లకు ఒక పాయింటును ఏర్పాటు చేసి గ్రామ సచివాలయాల సిబ్బందిని నిఘా కోసం నియమించారు. ఈ కాల్వలపై సుమారు 80 మంది ఉద్యోగులను నియమించగా, వారిలో 20 మంది సచివాలయాల మహిళా ఉద్యోగులు ఉన్నారు. చెరువులను నింపే ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ టీములకు ప్రతీ రోజూ ఉదయం 6 నుంచి 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు, రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు డ్యూటీలు వేశారు. అయితే కొంతమంది మహిళా ఉద్యోగులకు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు కాల్వలపై డ్యూటీలు వేయడం విమర్శలకు దారి తీస్తోంది. రాత్రిళ్లు కాల్వలపై ఒంటరిగా డ్యూటీ చేయడం కష్టంగా, భయంగా ఉంటోందని పలువురు ఉద్యోగినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ గట్లపై కొన్నిచోట్ల పగటి సమయంలోను ఒంటరిగా మండు టెండలో డ్యూటీ చేయడం, పలుచోట్ల కోతుల బెడద, కనుచూపు మేరలో మను షులు కనిపించకపోవడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోందని వాపోతున్నారు. తమకు ఈ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

నేడు ఇంటర్ ఫలితాలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను శుక్రవారం ప్రకటించనున్నారు. ఈ మేరకు ఇంటర్‌బోర్డు అధికారులు జిల్లాకు సమాచారం పంపించారు. ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ నుంచి 20 వరకు జరిగిన ఇంటర్ పరీక్షల మూల్యాంకన ప్రక్రియ ఈనెల 4న ముగిసింది. ఫలితాల విడుదలకు మార్గం సుగమం కావడంతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 32,445 మంది విద్యార్థులు రెగ్యులర్, ఒకేషనల్ విభాగాల్లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 15,656 మంది ప్రథమ, 16,789 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులున్నారు. మొత్తం 51 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. గతేడాది మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షల ఫలితాల్లో జిల్లాకు ప్రథమ సంవత్సరంలో 63 శాతం ఉత్తీర్ణత, ద్వితీయ సంవత్సరంలో 68.76 శాతం ఉత్తీర్ణత లభించాయి. ఈ ఏడాది ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

పటిష్ఠ నిఘా ఉంచాం

ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు



- ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఏలూరు, ఉంగుటూరు, కైకలూరు శాసన సభ నియోజక వర్గాలతో పాటు దెందులూరు నియోజక వర్గంలోని కొన్ని గ్రామాలు గోపాలపురం నియోజక వర్గంలోని ద్వారకా తిరుమల మండలం ఉన్నాయి. వీటి పరిధిలో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశాం.
- ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 964 పోలింగ్ స్టేషన్లు ఉండగా వీటిలో 223 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఆ ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించాం.
- గత ఎన్నికల్లో కేసులు నమోదైన వారు ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో 621 మంది ఉండగా, వీరిలో ఇంకా 94 మందిని బైండోవర్ చేయాల్సి ఉంది. 307 మంది రౌడీ షీటర్లు ఉండగా 150 మందిని ఇప్పటి వరకు బైండోవర్ చేశాం.
- మాదక ద్రవ్యాల కేసుల్లో 115 మంది ఉండగా వారికి కౌన్సెలింగ్ ఇచ్చాం. ఇద్దరు జైలులో ఉన్నారు. మరో 20 మంది వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయారు.
- ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి సబ్ డివిజన్ పరిధిలో తనిఖీలు నిర్వహించి 35 లక్షల నగదు సీజ్ చేశాం. ఐదు నాటు తుపాకులు కల్గిన వారిని అరెస్టు చేసి వాటిని సీజ్ చేశాం. 400 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం. 75 ఎక్సైజ్ కేసులు నమోదు చేశాం.
- అక్రమ మద్యం, ఓటర్లకు తాయిలాలు ఇవ్వడానికి వస్తువులు ఎవరైనా నిల్వ పెట్టినా, నగదును నిల్వ పెట్టినా వెంటనే సమాచారం అందించండి.

- ఏలూరు క్రైం



నూజివీడు ఏఎంసీ ప్రవేశద్వారం

నెరవేరని కల..!

- హామీగానే నూజివీడు మామిడి మార్కెట్
- ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పాటుకు హామీ
- నేటికీ సాకారం కాని పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న మామిడి రైతులు

నూజివీడు, ఏప్రిల్ 11 : నూజివీడు కేంద్రంగా మామిడి మార్కెట్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతపై దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ఈ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. మాజీ మంత్రి, దివంగత ఎమ్మెల్సీ పాలడుగు వెంకట్రావు కృషితో నూజివీడు కేంద్రంగా మామిడి పరిశోధనా కేంద్రం ఏర్పాటైంది. మామిడి మార్కెట్‌ను నూజివీడులోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో నూజివీడులో మ్యాంగో హబ్‌ను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. తెలంగాణ విడిపోయాక రాష్ట్రంలో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న హైదరాబాద్ గడ్డి అన్నారం మార్కెట్ ఆ రాష్ట్రానికి వెళ్లిపోయింది. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలోనే నూజివీడు కేంద్రంగా మార్కెట్ ఏర్పాటు చేస్తే పక్కనే ఉన్న గన్నవరం నుంచి అంతర్జాతీయ మార్కెట్లైన సౌదీ అరేబియా, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు నూజివీడు మామిడి కాయలు ఎగుమతి చేయవచ్చని వివరిస్తూ మామిడి మార్కెట్ మంజూరు చేయాల్సిందిగా నాటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డిపై పాలడుగు ఒత్తిడి తీసుకొచ్చారు. అప్పట్లో నూజివీడు పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక ఏఎంసీ కేంద్రంగా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే అది హామీగానే మిగిలిపోయిందే తప్ప పదేళ్లుగా ఆచరణలోకి రాలేదు. వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణలో కృష్ణా జిల్లాలోని నూజివీడు నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో విలీనం చేశారు. అందుబాటులో ఉందనుకున్న నున్న మార్కెట్ ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి వెళ్లగా ఏలూరు జిల్లాలో సరైన మామిడి మార్కెట్ లేకుండా పోయింది. నూజివీడు పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ మార్కెట్లు ఏర్పాటైనా నూజివీడు నియోజకవర్గంలో అవి కూడా లేవు. ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు నియోజకవర్గం పరిధిలో విస్సన్నపేట, కొండపర్వ, తిరువూరు మండలం లక్ష్మీపురంలో, ఫైలవరం నియోజకవర్గంలోని చీమలపాడులో ఓ మోస్తారు మామిడి ప్రైవేట్ మార్కెట్లు ఉన్నాయి. ఈ మార్కెట్లను కేంద్రీకృతం చేసి నూజివీడు ఏఎంసీ పరిధిలో మామిడి మార్కెట్ ఏర్పాటు చేస్తే నూజివీడు మామిడికి మెరుగైన మార్కెట్ అవకాశాలు ఏర్పడతాయని రైతులు చెబుతున్నారు. పదేళ్లుగా స్థానికంగా పండుతున్న రసాలు, బంగినపల్లికి జియో ట్యాగింగ్‌ను వచ్చేందుకు కృషి చేయడం, అందులో కొంత ఫలితాన్ని సాధించారు.

దూరమైన రైల్వే రాక్‌లు

స్థానికంగా ఉత్పత్తి అవుతున్న మామిడిని దాదాపు మూడు దశాబ్దాలుగా జాతీయ స్థాయిలో ఢిల్లీ, కోల్‌కత్తా, ముంబై వంటి ప్రాంతాలకు ఎగుమతులకు రైల్వేశాఖ నూజివీడు రైల్వేస్టేషన్‌లో (కృష్ణా జిల్లా గన్నవరం నియోజక వర్గంలోని హనుమాన్ జంక్షన్‌లో నూజివీడు పేరుతో ఉన్న) రైల్వేరాక్‌లను అందుబాటులో ఉంచారు. రాష్ట్ర విభజన అనంతరం ఈ రైల్వేరాక్‌లు అందుబాటులో లేక మామిడి రైతు ఎగుమతులు చేసేందుకు వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. తిరిగి నూజివీడు రైల్వేస్టేషన్ నుంచి రైల్వేరాక్‌లను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ప్రోత్సాహాలతోనే మామిడికి భవిష్యత్

చీడపీడల ఉధృతి, వాతావరణ మార్పుల నేపథ్యంలో దిగుబడులపై ప్రభావం, ధరల్లో సేఠ్‌ల మాయాజాలం వంటి కారణాలతో ఇప్పటికే మామిడి రైతు తోటలను తొలగిస్తూ పామాయిల్, మొక్కజొన్న వంటి వాటివైపు మరిలారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ తరాలకు నూజివీడు మామిడిని అందించాలంటే స్థానికంగా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేసి ఇక్కడికే ఇతర ప్రాంతాల సేఠ్‌లను రప్పించడం, నూజివీడు రైల్వేస్టేషన్ నుంచి ఎగుమతులకు రైల్వేరాక్‌లను తిరిగి పునరుద్ధరించడం, మామిడి పరిశోధనా కేంద్రాన్ని విస్తృత పరిచి, పరిశోధనలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే చర్యలు చేపట్టాలి. మామిడి ఉప ఉత్పత్తులైన తాండ్ర పరిశ్రమ, పల్ప్ యూనిట్, ముక్కల పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. గత నాలుగేళ్ల నుంచి 200 ఎకరాల్లో పల్ప్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటిస్తున్నా నేటికీ ఆచరణలోకి రాలేదు.



చీమలపాడులో ప్రైవేట్ మార్కెట్‌లో మామిడికాయలు

నేడు ఈవీఎం, వీవీ ప్యాట్స్ ర్యాండమైజేషన్ : కలెక్టర్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 11 : ఎన్నికల నేపథ్యం లో ఈవీఎం, వీవీ ప్యాట్స్ ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల సమక్షంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎం, వీవీప్యాట్స్ యంత్రాలు కేటాయిస్తాం. ఈవీఎం, వీవీ ప్యాట్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుంది. 1,743 పోలింగ్ కేంద్రాలకు 4,184 బ్యాలెట్ యూనిట్లు, 4,184 కంట్రోల్ యూనిట్లు, 4,534 వీవీ ప్యాట్స్ సిద్ధం చేస్తున్నాం. ఈవీఎం, వీవీప్యాట్స్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహణకు ముగ్గురు అధికారులను ఇంచార్జులుగా నియమించాం' అని పేర్కొన్నారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువుల వివరాలను నమోదు చేసి, వాటి యజమానికి రసీదు ఇవ్వాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.1291.96 లక్షల విలువైన నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు.

15న సీఎం జగన్ భీమవరం రాక

భీమవరం రూరల్, ఏప్రిల్ 11 : సీఎం వైఎస్ జగన్ మేము సిద్ధం బస్ యాత్ర ఈ నెల 15న భీమవరం రానున్నట్లు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. '15న జగన్ యాత్ర ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర భీమవరంలో ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి జువ్వలపాలెం రోడ్డు, అంబేద్కర్ సెంటర్ మీదుగా బైపాస్ రోడ్డుకు ఆనుకుని వున్న బహిరంగ సభ వేదికకు చేరుకుంటుంది' అని ఎమ్మెల్యే చెప్పారు.

ఏలూరు కోటలో నవతరం

- పట్టుబిగించిన ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్
- పార్టీ శ్రేణులతో నేరుగా ముఖాముఖి
- అసెంబ్లీ అభ్యర్థులతోనూ పరస్పర అవగాహన
- పైచేయి సాధించేందుకు పరుగులు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మిగతా పక్షాలతో పాటు తెలుగుదేశం ఈసారి ఎన్నికల పకడ్బందీ వ్యూహం అమలు చేస్తోంది. బీసీ వర్గానికి చెందిన, యువకుడు, విద్యావంతుడైన పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను అభ్యర్థిగా రంగంలోకి దింపారు. మెట్ట, ఏజన్సీ ప్రాంతాలకు నెలవైన ఈ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలను ముఖ్యంగా రైతువారీ వర్గాలను, నిరుద్యోగులను, మహిళ లను ఆకర్షించే విధంగా వారి మద్దతు పొందేందుకు మహేష్‌కుమార్ శరవేగంగా అడుగులు వేస్తున్నారు. గత ఎన్నికల పోలింగ్ సరళిని అంచనా వేస్తూ అప్పటికి ఇప్పటికి మార్పు ఉండేలా అదికూడా తనవైపు మొగ్గు ఉండేలా జాగ్రత్త పడుతు న్నారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పార్టీలో ఉన్న ఒడిదుడుకులను ఆసాంతం సవరించి పార్టీ సీనియర్లను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కూడ కట్టుకోగలుగు తున్నారు. తాను గోదావరి జిల్లాల అల్లుడినేనని ఈ ప్రాంత ప్రజలు తనకు చిరపరిచయస్థులని, స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నానంటూ తాను పాల్గొంటున్న ఆత్మీయ సమావేశాలు, కార్యకర్తల సమావేశాలు, వ్యక్తిగతంగా వచ్చి కలుస్తున్న వారితోనూ విడమర్చి చెబుతున్నారు. ఇది దాదాపు ఆయనకు పూర్తిగా కలిసిసొచ్చిన అంశమైంది. తెలుగుదేశం అభ్యర్థిగా మిత్రపక్షాలను బల పర్చడంతో అది యువకుడు కావడంతో పుట్టా వైపు స్వల్ప వ్యవధిలోనే ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నారు. ఏరోజుకారోజు నియోజకవర్గాల వారీగా సమీక్షించు కుని లోటుపాట్లను సవరించుకునే దిశగా సీనియర్లతో చర్చకు దిగుతున్నారు. ప్రచార సరళిలోనూ తనకు ఒక ముద్ర ఉండేలా కలుపుగోలుగా వ్యవహరిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీ అభ్యర్థిగా మహేష్‌కుమార్ యాదవ్‌ను ప్రకటించిన తర్వాత అతి తక్కువ సమయంలోనే ఆయన అందరితో మమేకమవు తున్నారు. స్వచ్ఛమైన మనస్సుతో అందర్ని భుజం తడుతూ నాకు మద్దతుగా నిలవండి అంటూ ప్రచారం జరుగుతున్న ప్రతిచోట ఆయన వినయంగా అభ్యర్థించడం రాజకీయాల్లో సరికొత్త ట్రెండ్‌గా తెలుగుదేశం నేతల్లో అత్యధికులు అభిప్రాయ పడుతుండగా దీన్ని టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు సమర్థిస్తూ వస్తున్నారు. నూజివీడు నియోజక వర్గంలో కొలుసు పార్థసారథి, దెందులూరులో చింతమనేని ప్రభాకర్, చింతలపూడిలో సొంగా రోషన్‌కుమార్‌తోనే కాకుండా ఉమ్మడి కూటమి అభ్యర్థులు, ఉంగుటూరులో ధర్మరాజు, కైకలూరులో డాక్టర్ కామినేని శ్రీనివాస్, పోలవరంలో చిర్రి బాలరాజుతోనూ, ఏలూరు అసెంబ్లీ అభ్యర్థి బడేటి చంటితో ఎప్పటికప్పుడు ప్రచార సడలిపైన పార్టీపరంగా పాటిం చాల్సిన నియ మావళి పైన ఎన్నికల సంఘం జారీచేసిన నియమావళికి అనుగుణంగా తాము ఎలా అడుగులు వేయాలో ఆయన చర్చిస్తూనే ఇంకోవైపు దూసుకు వెళతున్నారు. కీలకమైన కొల్లేరు సమస్యపై ఇప్పటికే అవగాహన తెచ్చుకుని ఈ అంశంపై కైకలూరు, ఏలూరు, ఉంగుటూరు నియోజక వర్గ నేతలతోనూ పూర్తి అవగాహన లభించేలా చర్చించారు. కొల్లేరు పరిధిలో ఉన్న అనేక సమస్యలను ఆయన ఇప్పటికే ఎత్తిచూపుతున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి.



బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్‌తో ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేశ్ యాదవ్

అందరితో కలిసి.. వడివడిగా అడుగులు

'ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో ఉమ్మడి కూటమి అభ్యర్థులతో ఏరోజుకారోజు సమీక్షించుకుంటూనే ఇంకోవైపు సీనియర్లతోనూ చర్చించి అందరితో కలిసిపోతూ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ వడివడిగా అడుగులు వేస్తున్నారు. సామాజిక వర్గాల వారీగా అందరిని కలుపుకుని వెళ్లడంలో ఇప్పటికే ఆయన పై చేయి సాధించారంటూ ఉమ్మడి కూటమి ఓ నిర్ణయానికి వచ్చింది. ఆయన వ్యవహారశైలి సరళంగా, మృదువైన మాటలతో ఆకర్షించేలా నేరుగానే ప్రచారానికి దిగడం ఆయన ప్లస్‌మార్కులుగా కూటమి అభివర్ణిస్తోంది'. జనసేన, బీజేపీతో సహా టీడీపీ కార్యకర్తలు అందరికి ఆయన చిరపరిచితులుగా మారారు. తనకు ఈ ప్రాంత సమస్యలను నూటికి నూరుశాతం పరిష్కరించే సత్తా ఉందని, ప్రత్యేకించి రైతువారీ సమస్యలను, నీటి సమస్యను పరిష్కరిస్తానంటూ ఇప్పటికే ప్రచారంలో హోరెత్తిస్తూ వచ్చారు. ఇవన్ని మహేష్ కుమార్ యాదవ్‌కు కలిసి వచ్చినట్లే కనిపిస్తోంది. అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లోనూ పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులు కూడా ఆయన స్పీడ్‌ను అందుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీసీ వర్గాల అభ్యర్థిగా తనకు సంపూర్ణ మద్దతు, సహకారం ఇవ్వాలని ఆయన ప్రతి నియోజకవర్గ ప్రచారంలో అభ్యర్థిస్తూనే ఉన్నారు.



ఆర్టీసీ ఎండీ తిరుమలరావు దంపతులకు, రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ సూర్యకుమారికి చిత్రపటం అందజేస్తున్న ఈవో త్రినాథరావు

చిన వెంకన్నను దర్శించిన ఆర్టీసీ ఎండీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 11: చిన్నతిరుమలేశుడిని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సిహెచ్ ద్వారకాతిరుమలరావు కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. ఈవో త్రినాథరావు ఎండీ తిరుమల రావు దంపతులకు శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సేవలో రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్

మత్స్యశాఖ కమిషనర్ ఏ సూర్యకుమారి గురువారం ఉదయం చినవెంకన్నను దర్శించారు. ముందుగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకుల నుంచి స్వామివారి శేష వస్త్రాన్ని అందుకున్నారు. ఈవో స్వామివారి చిత్రపటం అందజేశారు.



ప్రేక్షకులతో మాట్లాడుతున్న హీరోనవదీప్, హీరోయిన్స్

అందరికి నచ్చే చిత్రం లవ్‌మౌళి

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 11: నవదీప్ నటించిన లవ్‌మౌళి చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. వేసవి కానుకగా ఈనెల 19 లేదా 26న థియేటర్‌లో సందడి చేయ నుంది.ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా గురువారం ఏలూరు ఎస్‌వీసీ మల్టీప్లెక్స్‌లో లవ్‌మౌళి ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. హీరో నవదీప్‌తో పాటు హీరోయిన్లు పంకూరి గిద్వానీ, భావనాసాగి, రచయిత అనంత్‌శ్రీరామ్, ప్రేక్షకులతో కలిసి సందడి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో నవదీప్ మాట్లాడుతూ మను షలకు దూరంగా బతుకుతున్న ఒక వ్యక్తికి ఒక్కసారిగా ప్రేమ దొరికితే ఎలా ఉంటుందో అనే కోణంలో లవ్‌మౌళి మూవీని తెరకెక్కించినట్లు తెలిపారు. లవ్, ఎంటర్ టైన్‌మెంట్ ఈ చిత్రంలో అందుతుందన్నారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన తెలుపుతున్న బాలింత బంధువులు

ఆసుపత్రి ఎదుట బాలింత బంధువుల ఆందోళన

వైద్యం వికటించి కాళ్లు చేతులు పడిపోయాయని ఆగ్రహం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 11: తాడేపల్లిగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో డెలివరీకి వెళ్లిన బాలింతకు వైద్యం సరిగా అందించకపోవడం వల్ల కాళ్ల,చేతులు పడిపోయాయని బాలింత బంధువులు గురువారం ఆందోళనకు దిగారు. నల్లజర్ల మండలం ఆవుపాడుకు చెందిన వెజ్జు ప్రియాంకను డెలివరీ కోసం ఆసుపత్రిలో చేర్చారు. అయితే ఆపరేషన్ చేసిన మూడో రోజు ప్రియాంకకు సీరి యస్ అవడంతో ఆసుపత్రి వారు రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం అందించినా ప్రియాంకకు ఒక పక్క కాళ్లు, చేతులు పనిచేయక పోవడంతో ప్రియాంక బంధువులు తాడేపల్లిగూడెం ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. ఆసుపత్రిలో మత్తు సరిగా ఇవ్వకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రియాంక తండ్రి అచ్యుత వెంకటస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై డాక్టర్‌ని వివరణ కోరగా ప్రియాంక పరిస్థితి ఇలా అవడానికి ఫిట్స్ రావడమేనని దానికి సంబం ధించిన రిపోర్టులు అన్నీ క్లియర్‌గా ఉన్నాయన్నారు.



ముదినేపల్లిలో పోల్‌రాజ్ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ, ఈఈ

కాల్వలకు నీటి విడుదల పెంచేందుకు కృషి

» ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సత్యనారాయణ

ముదినేపల్లి, ఏప్రిల్ 11 : తాగునీటి అవసరాలకు మంచి నీటి చెరువులను నింపేం దుకు కాల్వలకు నీటి విడుదల పెంచే విషయంలో చర్యలు తీసుకుం టున్నట్టు ఏలూరు జిల్లా ఆర్ డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎల్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ త్రినాథబాబు, ఎంపీడీవో మురళీ గంగాధర్‌రావు, ఈవోపీఆర్‌డీ లక్ష్మీనారాయణతో కలసి ముదినేపల్లి మండలంలోని మంచినీటి చెరువులను, కాల్వలకు విడుదలైన నీటి వినియోగాన్ని పరిశీలించారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద పోల్ రాజ్, క్యాంప్ బెల్, బంటుమిల్లి ప్రధాన కాల్వలకు విడుదల చేసిన నీటి పరిమాణాన్ని పరిశీలించారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీరు చెరువులను నింపేందుకు సరిపోదన్న విషయాన్ని ఎస్‌ఈ గుర్తించారు. ఆయన మాట్లాడుతూ కాల్వలకు నీటి విడుదలను పెంచే విషయా న్ని ఇరిగేషన్ కృష్ణా తూర్పు డెల్టా ఎస్‌ఈ ప్రసాద్‌బాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలో 158 మంచినీటి చెరువులు ఉండగా, సుమారు 50 చెరువవులను నింపడం ప్రారంభించినట్టు తెలిపారు. కాల్వల శివారు ప్రాంతాల చెరువులను నింపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, నీటి అక్రమ వినియోగం జరుగకుండా నిఘా బృందాలు పని చేస్తున్నట్టు ఎస్‌ఈ తెలిపారు.

10-04-2024 పొగాకు ధరలు (రూ.)

పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	242	225	235.57
జంగారెడ్డిగూడెం-1	242	235	240.23
జంగారెడ్డిగూడెం-2	242	235	239.81
కొయ్యలగూడెం	244	235	240.04
గోపాలపురం	243	235	239.89

రంజాన్ సందడి



ఏలూరులో ప్రార్థనలు

గురువారం జిల్లా అంతటా రంజాన్ సందడి నెలకొంది. ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. చిన్నారులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ పార్టీల నాయకులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.



కైకలూరులో ప్రార్థనలు చేస్తున్న కామినేని





భీమవరంలో శుభాకాంక్షలు తెలుపుతున్న రామాంజనేయులు



ఏలూరులో చిన్నారి ప్రార్థన..



రంజాన్ శుభాకాంక్షలు



ఆకివీడులో మాజీ ఎమ్మెల్యే శివ, ఏలూరులో ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి, పాలకొల్లులో ఎమ్మెల్యే రామానాయుడు ప్రార్థనలు



అప్పనవీడులో చింతమనేని, తణుకులో ఆరిమిల్లి ముస్లింలకు శుభాకాంక్షలు

వలంటీర్లకు టీడీపీ భరోసా



అధికారంలోకి రాగానే రూ.10 వేలు

యథావిధిగానే వలంటీర్ల సేవలు

చంద్రబాబు హామీ

రాజీనామా చేయాలంటూ

పక్కదారి పట్టిస్తున్న అధికార పార్టీ నేతలు



(భీమవరనం-ఆంధ్రజ్యోతి)

మాకు రాజకీయాలు ఎందుకు. ప్రభుత్వం ఏది చెపితే అదే చేస్తాం. అధికారులు చెపుతున్న పనులు మాత్రమే నిర్వహిస్తాం. ఎన్నికలతో మాకు సంబంధం లేదు. అధికారులు తీసుకోమన్న సమాచారం మాత్రమే తీసుకుంటున్నాం. అంతే తప్ప ఎన్నికల్లో రాజకీయ పార్టీల తరపున పాల్గొనేదీ లేదు. అది మాకు సంబంధం లేని విషయం. ఇది తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓ వలంటీర్ వ్యాఖ్య.

నేను చదువుకున్నాను. వలంటీర్‌గా వెళితే ఆర్థికంగా ప్రయోజనం ఉంటుందని భావించాను.ఇంటర్వ్యూలో అర్హత సాధించాను. అధికారులు చెప్పిన పనే చేశాను. రాజకీయాలతో నాకు సంబంధం లేదు. వెళ్లను కూడా. వేతనం పెంచుతామంటే మంచిదే కదా. ప్రభుత్వానికే మేము బాధ్యులం. కానీ పార్టీకి కాదు. ప్రచారం చేయమంటే నేను చేయనంటూ తణుకులో మరో వలంటీర్ చెప్పిన మాటలివి.

రాజకీయాలకు దూరంగా ఉంటే భవిష్యత్తు

వలంటీర్లకు తెలుగుదేశం భరోసా ఇచ్చింది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వేతనాన్ని రూ.10 వేలు చేస్తామంటూ తెలుగుదేశం అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చారు. వలంటీర్లు ప్రభుత్వ విధులకే పరిమితం కావాలి. పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దంటూ సూచించారు. అయితే అధికార పార్టీ నేతలు మాత్రం వలంటీర్లను భ్రమల్లో పెడుతున్నారు. రాజీనామాలు చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో కొంతమంది వలంటీర్లు రాజీనామా చేశారు. వాస్తవానికి ఒక దశలో వలంటీర్లు తమ వేతనాన్ని పెంచాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వలంటీర్లు సేవకులు అంటూ జగన్ సంబోధించారు. వేతనాలు పెంచలేదు. పెన్షన్‌లు పంపిణీ, సంక్షేమ పథకాలు పంపిణీలో దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీనిని తెలుగుదేశం కూటమిపైకి వైసీపీ నెట్టే ప్రయత్నం చేసింది. ఎన్నికల వేళ తమకు ఉపయోగపడతారని భావించిన వైసీపీ ఈసీ ఆదేశాలతో ఖంగతింది. జిల్లాలో వలంటీర్లతో రాజీనామాలు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికల్లో అధికార పార్టీకి వంతపాడేలా పన్నాగం చేశారు. అయితే వలంటీర్లను కొనసాగిస్తామంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. వేతనం పెంచుతామంటూ భరోసా కల్పించారు. జిల్లాలో 9200 మంది వలంటీర్లు ఉన్నారు. ఇప్పటిదాకా 1062 మంది వలంటీర్లు తమ రాజీనామాలను సమర్పించారు. అయితే రాజీనామాలకు, ఎన్నికల్లో పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటే వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉండే అవకాశం ఉంది. దానికితోడు ఉన్నత విద్య అభ్యసించిన వలంటీర్లకు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుంది.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

ఎస్‌ఈబీ రాష్ట్ర జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని ఎస్‌ఈబీ రాష్ట్ర జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యా లయంలో గురువారం జిల్లా ఎస్‌ఈబీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ మద్యం, సారా, నగదు అక్రమ రవాణా జరుగకుండా చూడాలన్నారు.అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఏ సమస్య వచ్చినా సత్వరం పరిష్కరించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

జిల్లాలో చేపట్టిన చర్యలను ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు వివరించారు. ఎస్‌ఈబీ డీఎస్పీ జనార్ధన్ నాయుడు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గణపతిరావు, ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్, జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఒక వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం ద్వారకానగర్‌కు చెందిన ఉద్దవల్లి కిషోర్ (37)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బార్బర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తు న్నాడు. కుటుంబ అవసరాలు నిమిత్తం అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేక గురువారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని అపస్మారక స్థితిలో ఉండగా అతని భార్య గమనించి ఇరుగుపొరుగు వారి సహకారంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి ఈ సంఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కిషోర్ మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రెండు బైక్‌లు ఢీ..ఇద్దరి మృతి



మృతి చెందిన జలపాలు, సాయి



జీలుగుమిల్లి, ఏప్రిల్ 11 : జీలుగుమిల్లి శివారు రమణక్కపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. టి.నరసాపురం మండలం బండివారిగూడెంకు చెందిన రాయల జలపాలు, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరానికి చెందిన వసం తవాడ సాయి జాతీయ రహదారిపై బైక్‌లపై వస్తూ ఎదురెదురుగా రమణ క్కపేట సమీపంలో ప్రమాద వశాత్తు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రాయల జలపాలు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి సాయి ఆస్పత్రికి తరలి స్తుండగా మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ వి.చంద్ర శేఖర్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు సొమ్ము అడిగినందుకు దాడి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : అప్పు ఇచ్చిన సొమ్ము ఇమ్మని అడిగినందుకు ఇద్దరు వ్యక్తులు దాడి చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు చెందిన మండలపు వంశీ ప్రదీప్ ఆక్వా ఫుడ్ వ్యాపారం చేస్తుంటాడు. గణపవరానికి చెందిన పువ్వల పవన్‌కుమార్, రాజేష్‌లకు కొంత సొమ్ము అప్పుగా ఇచ్చాడు. ఆ సొమ్ము తీర్చాలని అడగడంతో పవన్‌కుమార్, రాజేష్‌లు షాపునకు వచ్చి షాపులోని ఫర్నీచర్ ధ్వంసం చేసి దాడి చేశారు. దీంతో బాధితుడు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : ఆన్‌లైన్‌లో మోసపోయిన ఒక బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఏలూరు శనివారపుపేటకు చెందిన ఏగంపాటి సత్యదుర్గ సాయి కిరణ్ తన ఫోన్‌లో అనూషా హెచ్‌ఆర్ మేనేజర్ అనే లింకు ఓపెన్ చేసి వారు ఇచ్చిన టాస్క్‌లను ఆడాడు. ఒక్కో టాస్క్‌కు ఒకొక్క రేటు పెట్టారు. కట్టిన రేటుకు డబుల్ అమౌంట్ వస్తుందని నమ్మడంతో దఫ దఫాలుగా మూడు లక్షల 20 వేలు రూపాయలు కట్టారు. మొదటిలో రెట్టింపు వచ్చింది. ఆ తరువాత డిపాజిట్ చేసిన సొమ్ములను తిరిగి ఇవ్వకుండా మోసం చేశారు. తాను మోస పోయానని గమనించి బాధితుడు ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో దూకిన కుటుంబం ?

భర్త మృతదేహం లభ్యం



భార్య యోచనతో కిషోర్ కుమార్ (ఫైల్ ఫొటో)

యలమంచిలి, ఏప్రిల్ 11: భీమ వరానికి చెందిన బొంతు కిషోర్ కుమార్ (32), అతని భార్య యోచన, రెండేళ్ల కుమార్తె నిధిశ్రీ చించినాడ బ్రిడ్జి వద్ద గోదావరిలో దూకారని భర్త మృత దేహం లభ్యమైనట్టు ఎస్‌ఐ కె.శివన్నా రాయణ తెలిపారు. ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న కిషోర్ కుమార్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం కిషోర్ సోదరుడు ఉదయ కిరణ్ అతనికి ఫోన్ చేయగా ఎవరో ఫోన్ లిఫ్ట్ చేసి ఈ మొబైల్ చించి నాడ బ్రిడ్జిపై ఉందని, దీంతోపాటూ బ్యాగ్, చెప్పులు ఉన్నాయని చెప్పారు. దీంతో వెంటనే అతని బంధువులు బ్రిడ్జి వద్దకు చేరుకుని ఆ వస్తువులు కిషోర్‌కు చెందినవిగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిషోర్ కుటుంబం ఆచూకీ కోసం పోలీసులు గురువారం గోదావరిలో గాలించగా సాయంత్రం కిషోర్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. అతని భార్య, కుమార్తెల ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపి వేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటా రని ఎస్‌ఐ తెలిపారు.శుక్రవారం ఉదయం గాలింపు కొనసాగిస్తామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కవిటంలో రెండు తాటాకిళ్లు దగ్ధం

పోడూరు, ఏప్రిల్, 11 మండలంలోని కవిటం శివారు పాటిమీద గురువారం గ్యాస్ లీకై మంటలు చెలరేగి రెండు తాటాకిళ్లు దగ్ధం అయ్యాయి. అన్నదమ్ములు ఉడుం బాలకృష్ణ, కోటేశ్వరరావుకు చెందిన తాటాకు ఇంటిలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో వీరి ఇంటికి ఆనుకుని ఉన్న మారుమూడి శ్రీనుకు చెందిన తాటాకిల్లు కూడా దగ్ధం అయ్యింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇళ్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి. తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐ కందుల రాంబాబు, వీఆర్వో ఆంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు. రూ.3 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని రెవెన్యూ, అగ్ని మాపక సిబ్బంది తెలిపారు.బాధిత కుటుంబాలకు 40 కిలోల బియ్యం అందజేశారు.



ఎంపీడీవోకు రాజీనామాలు అందజేసిన జనార్దనవరం వలంటీర్లు

మూకుమ్మడి రాజీనామాలు ?

ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 503 మంది రాజీనామా

ఏలూరుసిటీ, ఏప్రిల్ 11: గ్రామాల్లో, పట్టణాల్లో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేయడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వ్యక్తిగత కార ణాల వల్ల రాజీనామా చేస్తున్నారని ప్రకటిస్తున్నా ఇందులో రాజకీయ కోణం ఇమిడి ఉందనే విమర్శలు ప్రతిపక్షాల నుంచి వినబడుతున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం ఎన్నికల విధుల్లో వలంటీర్లను వినియోగించ రాదని ఆదేశాలు జారీ చేసిన తర్వాత రాజీనామాలు ఎక్కువయ్యాయన్నారు.అధి కార పార్టీకి వలంటీర్లు కార్యకర్తలుగా పనిచేస్తున్నారనే విమర్శలు ప్రతి పక్షాల నుంచి వినవస్తున్నాయి.

ఏలూరు జిల్లాలో మొత్తం పట్టణాలతో కలిపి 31 మండలాల్లో సుమారు 10,600 మంది వలంటీర్ల విధులను నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఇప్పటివరకు 24 మండలాలకు సంబంధించి 503 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఎన్ని కల కోడ్ ఉల్లంఘించారనే ఫిర్యాదులు రావడంతో జిల్లాలో 15 మంది వలం టీర్లను తొలగించారు. మండలాల వారీగా పరిశీలిస్తే ఆగిరిపల్లిలో 13, భీమడోలులో 93, చాట్రాయిలో 20, చింతలపూడిలో ఇద్దరు,దెందులూరులో 92 మంది, ఏలూరు రూరల్‌లో 9 మంది, ఏలూరు అర్బన్‌లో 11 మంది, జంగా రెడ్డిగూడెం రూరల్‌లో 9 మంది, జీలుగుమిల్లిలో 17 మంది, కైకలూరులో 46 మంది, కొయ్యలగూడెంలో ఏడుగురు, కుక్కునూరులో ఒకరు, మండవల్లిలో ఒకరు, ముదినేపల్లిలో 57 మంది, ముసునూరులో 28 మంది, నిడమర్రులో ఒకరు, నూజివీడు అర్బన్‌లో 12 మంది, రూరల్‌లో 38 మంది, పెదపాడులో ఒకరు, పెదవేగిలో ఒకరు, ఉంగుటూరులో 43 మంది వలంటీర్లు రాజీనామా చేయటం జరిగింది. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి 15 మంది వలంటీర్లను విధుల్లోంచి తొలగించారు. ఆగిరిపల్లిలో ఇద్దరు, చింతలపూడి అర్బన్‌లో నలు గురు, ఏలూరు రూరల్‌లో ముగ్గురు, కలిదిండిలో ఒకరు, కొయ్యలగూడెంలో ఇద్దరు, పెదవేగిలో ఒకరు, ఉంగుటూరులో ఇద్దరు వలంటీర్లను వివిధ ఫిర్యాదులపై విచారణ జరిపి తొలగించారు.

చాట్రాయి మండలంలో 20 మంది..

చాట్రాయి, ఏప్రిల్ 11: మండలంలోని ఆరుగొలనుపేట గ్రామ వలంటీర్లు 8 మంది, జనార్దనవరం గ్రామ వలంటీర్లు 12 మంది మొత్తం 20 మంది తమ రాజీనామా పత్రాలను గురువారం ఎంపీడీవో మంగాకుమారికి అందజేశారు.



బొత్తప్పగూడెంలో సారా ఊట ధ్వంసం చేస్తున్న సిబ్బంది

114 లీటర్ల మద్యం, లక్షా 85 వేలు స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 25,740 రూపాయల విలువైన 114 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో లక్షా 85 వేలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

లక్ష నగదు స్వాధీనం

చింతలపూడి, ఏప్రిల్ 11: చింతలపూడి మండలం లింగగూడెం చెక్‌పోస్టు వద్ద పత్రాలు లేని రూ.లక్ష నగదును ఎస్.ఎస్‌టీమ్ తనిఖీలో పట్టుకున్నట్లు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు. చింతలపూడికి చెందిన మందలపు వెంకట నారాయణ అనేవ్యక్తి ఈ నగదును తీసుకువెళుతుండగా ఎటువంటి పత్రాలు చూపకపోవడంతో ఈ నగదును జిల్లా ట్రెజరీలో జమ చేసినట్లు తెలిపారు.

100 లీటర్ల సారా స్వాధీనం

జీలుగుమిల్లి, ఏప్రిల్ 11: కామయ్యపాలెం గ్రామ శివారు బొత్తప్పగూడెం కాలువ సమీపంలో సారా తయారీ స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 100 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని సుమారు 2000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు.

గన్నీ బ్యాగ్ గోదాములో అగ్ని ప్రమాదం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11: ఏలూరు వన్ టౌన్ గడియార స్తంభం ప్రాంతంలోని గన్నీ బ్యాగ్ గోదాములో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఏలూరు వన్ టౌన్ ప్రాంతానికి చెందిన కర్రి శ్రీనివాసరావు గన్నీ బ్యాగ్ గోదాము నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో గమనించిన సిబ్బంది అగ్ని మాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.75 వేల ఆస్తి నష్టం సంభవించి నట్లు అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. ప్రమాదానికి సంబంధించి కారణాలను సేకరిస్తున్నామని, ఏలూరు అగ్ని మాపక అధికారి వీవీ రామకృష్ణ తెలిపారు. సుమారు రూ. 1.75 లక్షల ఆస్తిని కాపాడామని ఆయన తెలిపారు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరగి ఉండవచ్చని భావిస్తున్నారు.

వైసీపీ పాలనలో జలవనరుల రంగం నిర్వీర్యం

నూజివీడు, ఏప్రిల్ 11: రాష్ట్రంలో జలవనరుల రంగాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సీనియర్ టీడీపీ నేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. గురువారం నూజివీడులో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో జలవనరుల రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చుచేసి 67 ప్రాజెక్టులు చేపట్టి, వాటిలో 23 ప్రాజెక్టులను పూర్తిచేసి 32 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిం చిందన్నారు. వైసీపీ గత ఐదేళ్లలో రూ.32 వేల కోట్లు ఖర్చుచేసి ఒక్కఎకరం కూడా స్థిరీకరించకుండా జలవనరుల రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు.



తహసీల్దార్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో సూర్యతేజ

ఓటు వినియోగంపై అవగాహన కల్పించండి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 11: ప్రతి ఓటరు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో, పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ ఎన్నికల అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఎన్నికల నిర్వహణపై తహసీల్దార్లతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ ఓటర్లను చైతన్యవంతులను చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని, ఎన్నికల నిబంధనలను అమలు చేయాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, చెక్‌పోస్టుల వద్ద అధికారులు, సిబ్బంది డబ్బు, మద్యం అక్రమంగా తరలించకుడా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో పీవీఎస్.నాయుడు, ఎస్‌డీసీ శ్రీనివాసులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శర్మిష్ట

జ్వరాలపై అప్రమత్తత అవసరం : జిల్లా వైద్యాధికారి

చింతలపూడి, ఏప్రిల్ 11: ప్రస్తుత సీజన్‌లో జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాకారి డాక్టర్ శర్మిష్ట అన్నారు. యర్రంపల్లిలోని హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం ఆమె సందర్శించారు. సిబ్బందితో మాట్లాడుతూ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రక్త పరీక్షలు చేయించాలని సూచించారు. గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేయించాలని, మంచినీటి సరఫరా ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. గ్రామంలో జ్వరాల నివారణకు నాలుగు టీమ్‌లను ఏర్పాటుచేసుకుని ఫీవర్ సర్వే చేయాలన్నారు. ఎండలు తీవ్రం కావడంతో వడదెబ్బపై అవగాహన కల్పించాలన్నారు. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకునే విధంగా ప్రజలకు సూచించి, చైతన్యం తేవాలన్నారు. కార్యక్రమంలో ఆమెవెంట డిఎమ్ఎస్‌వో డాక్టర్ జగన్‌మోహన్‌రావు, జిల్లా సర్వేలెన్స్ అధికారి నరేంద్రకృష్ణ, రాఘవాపురం వైద్యఅధికారి కృష్ణచైతన్య, ఎన్.ఏ ప్రసాద్, మరియమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లింగపాలెం పీ హెచ్‌సీలో..

లింగపాలెం: గ్రామాల్లో జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ఠ సిబ్బందికి సూచించారు. లింగపాలెం పీహెచ్‌సీని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్వరాల అదుపునకు గ్రామాల్లో చేపట్టిన చర్యలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఉప వైద్యాధికారి జగన్ మోహన్‌రావు, డీఎస్‌వో నరేంద్రకృష్ణ, పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ కిరణ్‌చైతన్య డాక్టర్ అనిల్‌కుమార్, పలువురు వైద్య సిబ్బంది ఉన్నారు.

14 నుంచి యాజ్ఞవల్క్య రాజాశ్రమ వార్షికోత్సవాలు



పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానంద భారతి

పెదవేగి, ఏప్రిల్ 11: ముండూరు సమీపంలోని యాజ్ఞవల్క్య రాజాశ్రమం 66వ వార్షికోత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు జరుగుతాయని పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానంద భారతి తెలిపారు. ఆశ్రమంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 3 రోజుల పాటు జరిగే వార్షికోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి జ్ఞానులు, పీఠాధిపతులు, ఆశ్రమాధిపతులు, సాధువులు, స్వాములు బోధనలు వినిపిస్తారని తెలిపారు. ఈనెల 13న జిల్లా కేంద్రం ఏలూరులో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. 1958లో ప్రబోధానందగిరిస్వామి ఈ ఆశ్రమాన్ని ప్రారంభించారని, నాటి నుంచి ఆధ్యాత్మిక సభలు, సమావేశాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సమావేశంలో ఆశ్రమ స్వాములు ప్రణవానంద భారతిస్వామి, చిత్స్వరూపానందగిరిస్వామి పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి



టీషర్టులు అందజేస్తున్న జిల్లా జైలర్

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11: విద్యతోపాటు క్రీడల్లోకూడా రాణించడం ద్వారా ఉన్నతవిద్య, ఉద్యోగావకాశాలను పొందవచ్చని ఏలూరు జిల్లా కారాగార అధికారి (జైలర్) కె.వెంకటరెడ్డి అన్నారు. స్థానిక కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో 15 మంది హ్యాండ్‌బాల్ క్రీడాకారిణులకు అవసరమైన టీషర్టులను గురువారం ఆయన అందజేశారు. ఏపీ కళాశాలల రిటైర్డ్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లేళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు దోహదం చేస్తాయన్నారు. క్రీడలవల్ల మేథాశక్తి మెరుగవుతుందన్నారు. వ్యాయామోపాధ్యాయులు ప్రసన్న, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 11: కౌలు రైతుల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నే భవన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభం ఫలితంగా కౌలు రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు కౌలురైతులకు అందడం లేదన్నారు. జగన్ కౌలురైతుల చట్టాన్ని రద్దుచేసి రైతులకు తీవ్ర అన్యాయం చేశాడన్నారు. రైతు భరోసా పంట రుణాలు, నష్టపరిహారాలు వాస్తవ సాగుదారులకు అందాలన్నారు. సమావేశంలో శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పాత గొడవలతో కొట్లాట : ఇరువర్గాలపై కేసు

పెదపాడు, ఏప్రిల్ 11 : పాత గొడవలను పురస్కరించుకుని ఈనెల 8న తనపై దాడి చేసి గాయపర్చారంటూ వెంకటాపురం గ్రామానికి చెందిన మిండాల శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే గ్రామానికి చెందిన గండికోట జ్ఞానేశ్వరరావు మరో ఇద్దరిపై ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేశారు. మరో కేసులో తనతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు కొట్టారంటూ మిండాల శ్రీను మరో ఆరుగురిపై గండికోట నాగభవానీ ఫిర్యాదు మేరకు ఎస్సై శుభశేఖర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ఏలూరులో సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న బడేటి చంటి



చింతలపూడి మెరకవీధిలో ప్రచారం చేస్తున్న రోషన్‌కుమార్ కార్యకర్తలు

అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు

ప్రజలు సిద్ధం

జిల్లాలో కూటమి అభ్యర్థుల ప్రచారం

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 11: వైసీపీ అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 32వ డివిజన్‌లో గురువారం ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. చంటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కూటమిని ఆశీర్వదించాలన్నారు. వైసీపీ ప్రభుత్వ అసమర్థ పాలనతో విసిగిపోయారన్నారు. అనుభవజ్ఞుడైన చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మతసామరస్యం వెల్లివిరిసేలా రంజాన్ వేడుకలు నిర్వహించుకుంటున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శివప్రసాద్, కాశీనరేష్, పృథ్వీ, శారద, నాయుడు సోము తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

చింతలపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామంటూ సూపర్‌సిక్స్ పథకాలపై కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, కార్యకర్తలు ప్రచారం చేశారు. మండలంలోని శంఖుచక్రాపురం, దేశవరం, పొనుకుమాడు, కంచెనగూడెం, చింతలపూడి మెరకవీధి, దివాణం వీధుల్లో ప్రచారం చేశారు. బోసుబొమ్మ సెంటర్లో చిరు వ్యాపారులతో మాట్లాడారు. ప్రగడవరంలో కార్యకర్తలు, నాయకులు ఆయనకు భారీగా స్వాగతం పలికారు. పొనుకుమాడులో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. బీసీలకు 50ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ ఇస్తామని చెప్పారు. తాళ్ళూరి చంద్రశేఖర్‌రెడ్డి, పక్కాల వెంకటేశ్వరరావు, అట్లూరి శ్రీనివాసరావు, తాటి అప్పారావు, కొమ్మారాజు సత్యనారాయణ, చీదరాల మధుబాబు, భారతి, హరికృష్ణ, రాజు పాల్గొన్నారు.

మందలపర్రులో జనంలోకి జన సేన

నిడమర్రు: వైసీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమైందని రానున్న ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయం కోసం మూడు పార్టీల కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని మందలపర్రులో గన్ని గోపాలం కలసి జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన వెంట నాలుగు మండలాల అధ్యక్షులు, జనసైనికులు, వీర మహిళలు, తెలుగుదేశం, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: కైకరంలో చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ సలగాల గోపి, సిరిబత్తుల కృష్ణమోహన్, ఎంపీటీసీ చెన్ను సత్యవాణి, బొడ్డు శాంతకుమారి, లింగంపల్లి పండు పాల్గొన్నారు. కాగుపాడులో కడియాల రవిశంకర్ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉంగుటూరులో సర్పంచ్ బండారు సింధు, మధు దంపతులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



జలపవారిగూడెంలో నూతన వధూవరులకు పథకాలు వివరిస్తున్న నేతలు

నూతన వధూవరులకు టీడీపీ పథకాల బ్రోచర్

కామవరపుకోట: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ జలపవారిగూడెంలో విస్తృత ప్రచారం చేశారు. గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో వధూవరులను ఆశీర్వదించి సూపర్ సిక్స్ పథకాలను వారికి వివరించారు. నూతన జంటకు పథకాల బ్రోచర్ అందజేశారు. టీడీపీ పాలనలో అయితే తమకు చంద్రన్న పెళ్లికానుక రూ.50వేలు వచ్చి ఉండేదని వధూవరులు అన్నారు. చంద్రబాబు పాలన రావాలనే కొత్త దంపతులు ఆకాంక్షను వెలిబుచ్చారు.



జ్యోతిరావుపూలే చిత్రపటం, విగ్రహాల వద్ద డీఆర్వో పుష్పమణి, బీటీఏ నాయకులు, ఏవీఆర్ విజ్ఞానకేంద్రం ప్రతినిధుల నివాళి

ఆదర్శప్రాయుడు జ్యోతిరావు పూలే

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 11: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, స్త్రీ విద్య కోసం పాటుపడిన జ్యోతిరావుపూలే ఆదర్శప్రాయుడని జిల్లా రెవెన్యూ అధికారి టి.పుష్పమణి అన్నారు. జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి డీఆర్వో పూలమాల వేసి నివాళులర్పించారు. చదువు అవసరమని పూలే ఆనాడే చెప్పడమే కాకుండా ఆచరించారన్నారు. విద్య, సమానత్వం ద్వారానే ఆర్థిక ఉన్నతికి బాట అని, పూలే ఆలోచన విధానాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. బీసీసంక్షేమశాఖ జిల్లా అధికారి ఆర్.నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.పుష్పలత, డీఆర్‌డీఏ పడీ ఆర్.విజయ్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: మహాత్మ జ్యోతిరావు పూలే దేశానికి మార్గదర్శనం చేసిన మహనీయుడు అని పలు బీసీ సంఘాల నాయకులు అన్నారు. జడ్పీ కార్యాలయం వద్ద మహాత్మ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎస్‌కేఆర్.విఠల్‌కుమార్, పామర్తి ఏసురాజు, వై.మోహన్‌కృష్ణ తదితరులు మాట్లాడారు. పి.ఆంజనేయులు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, అజయ్, పి.సూర్యనారాయణ, సర్వేశ్వరరావు, లక్కోజు రాజగోపాలచారి, బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆళ్ళ నాని క్యాంప్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, చలుమోలు అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టూటౌన్: సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగించాలని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి పిలుపునిచ్చారు. బడేటి క్యాంపు కార్యాలయంలో పూలే జయంతి గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంపా సూర్యనారాయణ, మధ్యాహ్నపు బలరాం, భీమవరపు అప్పారావు, త్రినాథ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించి జడ్పీ కార్యాలయం వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బి.మనోజ్‌కుమార్, సల్మాన్‌రాజు, జేసుదాసు, జి.వెంకటేశ్వరరావు, ధర్మలింగం, ఎ.సాయిరాజు, కృపాకరణ్ తదితరులు పాల్గొన్నారు. నవ సమాజ్ సొసైటీ కార్యాలయంలో చైర్మన్ నేతల రమేష్‌బాబు ఆధ్వర్యంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎస్‌ఏడీ.పాల్, కె.అంబేడ్కర్, ఎ.రతన్‌కాంత్, పాల్గొన్నారు. మాలమహానాడు కార్యాలయంలో పుష్పరాజ్, ఎస్సీ, ఎస్టీ బహుజన్ రైట్స్ ప్రొటక్షన్ సొసైటీ కార్యాలయంలో ఎం.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. నేతర అజయ్‌బాబు, ఎం.వెంకన్న, బాలరాజు, జాకబ్, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: జ్యోతిరావు పూలే జయంతి అన్నే భవన్‌లో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగింది. కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ లక్ష్మి, ఏవీఆర్ కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ విద్యనందించడానికి పూలూ 56 పాఠశాలలను నిర్వహించారన్నారు. పూలే భార్య సావిత్రిబాయి పూలేను చదివించి, టీచరుగా ప్రోత్సహించి తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, చదువుల తల్లిగా తయారుచేశారన్నారు. సిటీ డైరెక్టర్ ఆనంద సాగర్, కోడైరెక్టర్ శివరామకృష్ణ, గణేష్, సుబ్రహ్మణ్యం, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: కమ్మరగూడెం వద్ద జ్యోతిరావు పూలే జయంతి సొబ్బన మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జైభీమ్ యూత్ పాల్గొన్నారు.

● కామవరపుకోట: టీడీపీ కార్యాలయంవద్ద నాయకులు, కార్యకర్తలు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మద్దిపోటి నాగేశ్వరరాంబాబు, కోనేరు వెంకట సుబ్బారావు, కోటగిరి కిషోర్‌బాబు, నెక్కలపు గంగాధర్ పాల్గొన్నారు.

● ఉంగుటూరు: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే సేవలు అనిర్వచనీయమని బండారు నాగరాజు అన్నారు. నారాయణపురంలో పూలే చిత్రపటానికి లావేటి వీరాచారి చిన్న ప్రసాద్, మూల సురేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బలవంతంగా వైసీపీలో చేర్చుకున్నారు



టీడీపీకి తిరిగొచ్చిన నేతతో చింతమనేని

పెదవేగి, ఏప్రిల్ 11 : టీడీపీకి చెందిన నేతను వైసీపీ నాయకులు కొంత మంది బంధుత్వం పేరుతో బలవంతంగా వైసీపీలోకి చేర్చుకున్నారు. అయితే ఈ సంఘటనతో మధనపడిన అతడు సాయంత్రానికి తిరిగి టీడీపీ గూటికి చేరుకున్నాడు. లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్‌సీ కాలనీకి చెందిన వార్డు సభ్యుడు బాలిన శివను తమ పార్టీలో చేర్చుకున్నామంటూ వైసీపీ కండువా కప్పారు. ఆ పార్టీ ఇష్టంలేక సాయంత్రానికి చింతమనేని చెంతకు చేరి ఎప్పటికీ టీడీపీ వ్యక్తినే అని చెప్పారు. టీడీపీ కండువా కప్పి, పార్టీలోకి తిరిగి ఆహ్వానించారు. గార్లమడుగు గ్రామానికి చెందిన మేడికొండ సురేష్‌కూడా తిరిగి టీడీపీలోకి చేరారు. చింతమనేని మాట్లాడుతూ వైసీపీ చిల్లర రాజకీయాలతో బంధుత్వాలు కూడా దెబ్బతింటున్నాయన్నారు.

ఎన్‌డీఏ కూటమికి మద్దతుగా ప్రచారం



పురందేశ్వరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జాన్‌వెస్లీ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 11: రాష్ట్రంలో రాష్ట్రీయ లోక్‌జన్ శక్తి పార్టీ ఎన్‌డీఏకి మద్దతుగా ప్రచారం చేసి అభ్యర్థుల విజయానికి చిత్తశుద్ధితో కృషిచేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చాగంటిపాటి జాన్‌వెస్లీ అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధరేశ్వరిని కలసి ఎన్‌డీఏ అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఆమెను కలిసి తెలియచేసినట్లు జాన్‌వెస్లీ తెలిపారు.

జనసేనలోకి భారీగా చేరికలు



సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు

పోలవరం, ఏప్రిల్ 11 : పోలవరం నియోజకవర్గ జనసేన, టీడీపీ బీజేపీ కూటమి అభ్యర్థి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు ఆధ్వర్యంలో గురువారం 200 మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు జనసేన పార్టీలో చేరారు. పార్టీలోకి నూతనంగా చేరిన వారిని కరాటం రాంబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొణతాల ప్రసాద్, గూటాల నాయకులు మొగళ్ళ హరిబాబు కూడా జనసేన పార్టీలో చేరారు.





సాయుధ బలగాల కవాతులో డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి, సిబ్బంది

పోలవరంలో పోలీస్ కవాతు

పోలవరం, ఏప్రిల్ 11 : మండల కేంద్రంలో పోలీస్ కవాతు కార్యక్రమం గురువారం పోలవరం డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. డీఎస్పీ మాట్లాడుతూ కేంద్ర బలగాలతో ప్రజల్లో భయాందోళన తొలగించి చైతన్యవంతం చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుని సక్రమంగా వినియోగించుకుని రాష్ట్రంలో మంచి పరిపాలన తీసుకోవాలని కోరారు. సివిజిల్ యాప్ వినియోగించుకోవాలని సూచించారు. సీఐ మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్, కేంద్ర బలగాలు ఉన్నాయి.

18న సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11: సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉదయం 10గంటలకు ఉంగుటూరు మండలం నాచుగుంటలో సర్వోదయ స్థూపంవద్ద సర్వోదయ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం తెలిపారు. సర్వమత ప్రార్థనలు, శాంతి ప్రతిజ్ఞలు, సర్వోదయ యువ వాహిని ర్యాలీ నిర్వహిస్తామన్నారు. గాంధేయవాదులు, సర్వోదయ కార్యకర్తలు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, ఏప్రిల్ 11: ఏలూరు నార్త్ సెక్షన్ పరిధిలో 33 కేవీ అశోక్‌నగర్ ఫీడర్‌లో మరమ్మతు కారణంగా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జేపీబీ.నటరాజన్ తెలిపారు. ఆర్.ఆర్‌పేట, నాలుగు గుళ్ల సెంటర్, పానుగంటివారివీధి, అతిథి హోటల్, విజయ్‌విహార్ సెంటర్, అమీనాపేట, అశోక్‌నగర్, కత్తేబాద, మోతేవారితోట, పవర్‌పేట, ఎస్.ఆర్‌పేట, రంగూన్ మేడ, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

వంగాయగూడెం 33కె.వి పరిధిలో లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పవర్‌పేట, కొణంగి, గ్రీన్ సిటీ పరిధిలో పడమర వీధి, పాత బస్టాండు, వసంత్‌మహల్, రామకృష్ణాపురం, గ్రీన్‌సిటీ, హనుమాన్‌నగర్, కొల్లాయిగూడెం, గులాబీతోట, నెహ్రూ కాలనీ, పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

భీమడోలు మండలంలో..

భీమడోలు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ నటరాజన్ తెలిపారు. సూరప్పగూడెం, పూళ్ళ, ఆగడాలలంక మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపి వేస్తామన్నారు. మండలంలో సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెదవేగిలో..

పెదవేగి: విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో కొత్తలైన్ల ఏర్పాటు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని ఏడీ పి.శ్రీనివాస్ తెలిపారు. రామశింగవరం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో కూడా సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

జంగారెడ్డిగూడెంలో రంజాన్ తోఫా అందిస్తున్న టీడీపీ నాయకులు

ముస్లింలకు టీడీపీ నేతల రంజాన్ తోఫా

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 11 : రంజాన్ వేడుకలను గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక నమాజ్ చేశారు. పట్టణంలోని 1, 29 వార్డుల్లో తోట సతీష్, తెలుగు దేశం పార్టీ పట్టణ లీగల్ సెల్ మానికల సూరిబాబు, 1వ వార్డు అధ్యక్షులు మానికల వెంకటేశ్వరరావు, తెలుగు రైతు పట్టణ అధ్యక్షుడు మానికల నాగేశ్వరరావు, తెలుగు యువత పాకనాటి సురేష్, జంగా ప్రసాద్‌రెడ్డి, పాలూరి లక్ష్మణ్‌రావు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు రంజాన్ తోఫా అందజేశారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.1.10లక్షల విరాళం



నగదు అందిస్తున్న దాత

ఉంగుటూరు, ఏప్రిల్ 11: నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి వేగేశ్న సత్యనారాయణరాజు, ఆయన కుమారుడు సతీష్ రాజు రూ.1,10,000 విరాళాన్ని అందించారు. కళాశాల ఆవరణలో సీసీ రహదారుల నిమిత్తం ఈ మొత్తాన్ని వెచ్చించాలని విశ్రాంత పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణకు అందించారు.



ఏలూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చింతలపూడిలో నమాజ్ అనంతరం మాట్లాడుతున్న పీష్మా



భీమడోలులో నమాజ్ చేస్తున్న ముస్లింలు



ద్వారకా తిరుమల మండలం దొరసానిపాడు, పోలవరం మండలంలో ముస్లింల ప్రార్థనలు

రంజాన్ వేడుక

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 11: రంజాన్ పర్వదినాన్ని గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదుల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు అతిపెద్ద పండుగ కావడంతో రంజాన్ వేడుకగా నిర్వహిస్తున్నారు. అనంత శుభాలు, కఠోర ఉపవాసాలతో దేహ,ఆత్మశుద్ధి, తరావీహ్ నమాజ్‌లలోని ఖురాన్ శ్రవణంతో పుణ్యం, జకాత్ దానంతో సంపద శుద్ధి కల్పించిన పవిత్రరంజాన్ మాసం ముగింపు సందర్భంగా రంజాన్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఏలూరు కర్బలా మైదానం, ఇతర ప్రాంతాల్లో పండుగ నమాజ్‌ను చదివించారు. నమాజ్ అనంతరం ప్రాథమిక ఉపన్యాసం చేశారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కబర్‌స్థాన్‌లకు వెళ్లి పూర్వీకుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతి ఇంటా బిర్యానీ ఘుమఘుమలు, సేమియా సువాసన వెల్లువెత్తాయి.

● ఏలూరు టూటౌన్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కర్బాల మైదానంలో అంజుమాన్ - ఏ- మహాఫిజుల్ ఇస్లాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో కూటమి అభ్యర్థి బడేటి చంటి పాల్గొన్నారు. అన్ని మతాల ప్రజలందరూ సుఖశాంతులతో గడపాలని అల్లాను వేడుకున్నారు. ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

● పెదవేగి: ఆధ్యాత్మిక జీవనం సాగించేవారికి ఎప్పుడూ అల్లా రక్షణ ఉంటుందని లక్ష్మీపురం మసీదు గురువు పీఎం.సుభాని అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మసీదుల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లక్ష్మీపురం మసీదులో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ మాసం అని, సర్వమత సమ్మేళన, సద్భావవన, సర్వమానవ సమతకు ప్రతీక రంజాన్ అని, ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు చిన్నతనం నుంచి తమ బిడ్డలకు సేవాగుణం, స్నేహంగా మెలిగి విధానాన్ని అలవాటు చేయాలని, అప్పుడే మేలైన సమాజం ఏర్పడుతుందని ఆయన చెప్పారు. శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్ అనిమాజీఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలో పలు మసీదుల్లో జరిగిన ప్రార్థనల్లో చింతమనేని పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు.

● పెదపాడు: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పెదపాడు, అప్పనవీడు, వసంతవాడ తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. అప్పనవీడులో చింతమనేని ప్రభాకర్ పాల్గొని మతపెద్దలతో కలిసి ప్రార్థనలు నిర్వహించి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

● చింతలపూడి: రంజాన్ సందర్భంగా స్థానిక షాదీఖానాలో ముస్లింలు నమాజ్ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇమామ్ పీష్మాలు సందేశాలు అందించారు. ముస్లిం పెద్దలు సయ్యద్‌బాబు, జిలానీ వీరికి పారితోషికాలు అందించారు. హిందు, ముస్లిం, క్రైస్తవ సోదరులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● లింగపాలెం: ధర్మాజిగూడెంలోని మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలు ప్రజలకు మంచినీరు, మజ్జిగ, పండ్లు అందించారు. అల్లా ప్రజలను రక్షించాలంటూ రాష్ట్రంసుభిక్షంగా ఉండాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ముస్లింలు నమాజ్‌లో పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుతున్నారు. మసీదులను, ప్రార్థనా మందిరాలను అలంకరించారు. మండలంలోని దొరసానిపాడులోని ఈద్గా వద్ద రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

● భీమడోలు: మండల వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ, పోలసానపల్లి తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్షల అనంతరం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు భీమడోలు సంత మార్కెట్ నుంచి ఊరేగింపుగా పీర్ల చెరువు ఈద్గామైదానికి చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. మసీదు ఇమాం దిల్షద్ ఆధ్వర్యంలో భీమడోలు పరిసర ప్రాంతాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ప్రార్థనల అనంతరం ఖురాన్ సూక్తులను వినిపించారు. మసీదు కమిటీ చైర్మన్ షేక్ హసీనా, సిద్దిక్, రసూల్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో రంజాన్ సందర్భంగా గూటాల, ఎల్ఎన్‌డీపేట పోలవరం మసీదు కమిటీ ఆధర్వ్యంలో భాను థియేటర్ సమీపంలో ఈద్గా స్థలంలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సుమారు మూడు వేల మంది ప్రార్థనలలో పాల్గొన్నట్లు మసీదు కమిటీ అధ్యక్షులు ఎండి యాసీన్ షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రదానం, అన్నదానం , ఆర్థిక దానం నిర్వహించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



అవగాహన కార్యక్రమంలో సీఐ రామకృష్ణ

ఆగిరిపల్లి, ఏప్రిల్ 11: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలనే గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని సీఐ రామకృష్ణ తెలిపారు. నెక్కలంగొల్లగూడెం గ్రామంలో నూజివీడు సీఐ రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్ఐ సురేంద్రబాబు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. అనంతరం కనసానపల్లి గ్రామంలో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించి, ప్రజలకు ఓటు విలువను వివరించారు. బిడ్డల భవిష్యత్ కోసం ఓటు హక్కును జాగ్రత్తగా వినియోగించుకోవాలని సీఐ సూచించారు.

నేటినుంచి 'వరాహ పుష్కరిణి పనులు

» ఆంధ్రజ్యోతి వార్తకు స్పందించిన అధికారులు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 11: 'తుప్పల మధ్య వరాహపుష్కరిణి' అనేవార్త ఆంధ్రజ్యోతిలో బుధవారం వచ్చిన వార్తకు లక్ష్మీనరసింహ దేవస్థానం కార్యనిర్వహణ అధికారి టి.సురేష్‌బాబు స్పందించారు. ఆగిరిపల్లి పంచాయతీ సర్పంచ్ లక్ష్మీవిక్టర్‌తో చర్చించి పనికిఆహార పథకం పనులను మెట్లకోనేరులో చేయాలని అర్జీ సమర్పించారు. దీనికి సర్పంచ్ స్పందిస్తూ శుక్రవారం నుంచి పనులు మొదలు పెట్టిస్తామని హామీ ఇచ్చారు.

ఐదుగురికి కృత్రిమ కాళ్లు వితరణ



దివ్యాంగులతో దాతలు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 11: తోటపల్లి గ్రామంలోని హీల్‌కృత్రిమ అవయువ కేంద్రంలో గురువారం దాతల సాయంతో ఐదుగురికి కృత్రిమకాళ్ళు అందజేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆర్.జ్యోతి, విజయవాడకు చెందిన డి.రాజు, అబ్దుల్ వజీరుద్దీన్, ఒడిశా రాష్ట్రానికి చెందిన టక్రీజ్యోతి, గన్నవరానికి చెందిన టి.జేమ్స్‌లకు ఈ కాళ్లను అందజేశారు. ఈ కృత్రిమ కాళ్లకు ఆర్థికసాయం చేసిన శ్రీమతి వల్లభనేని లక్ష్మీకమల, చలమలశెట్టి మనోజ్‌కుమార్, కాటా శివనాగేంద్రమ్మలను కోస్టల్ ఏరియా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు. కోస్టల్ ఏరియా బ్యాంక్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదులను వేణుగోపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో హీల్ కార్యదర్శి శ్రీమతి తాతినేని లక్ష్మి, సీఈవో కూరపాటి అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



కె.కొత్తగూడెం మహిళా పాడి సంఘానికి బోనస్ అందజేస్తున్న దృశ్యం

చాట్రాయి, ఏప్రిల్ 11: కృష్ణామిల్క్ యూనియన్ అనుబంధంగా ఉన్న మండలంలోని కె.కొత్తగూడెం మహిళా పాల సహకార సంఘ సభ్యులకు రూ2.16 లక్షలు, యర్రావారిగూడెం సంఘ సభ్యులకు రూ.2.46 లక్షలు, కొత్తగూడెం సంఘ సభ్యులకు రూ. 78,750లను గురువారం తిరువూరు పాలశీతల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి ఆయా సంఘల అధ్యక్షులు బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు యూనియన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పాడి రైతులు, యూనియన్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటపాడు రామాలయాలకు వాటర్ కూలర్ల వితరణ



వాటర్‌కూలర్లు అందజేస్తున్న దాతలు

చాట్రాయి, ఏప్రిల్ 11: కోటపాడు గ్రామంలో వున్న పాత రామాలయం, కొత్త రామాలయాలకు వాటర్ కూలర్లను దాతలు వితరణ చేశారు. తెలుగు రైతు నాయకుడు బొంతు సత్యనారాయణ, చల్లగుళ్ళ ఇన్ఫ్రా ప్రాజెక్టు ఎం.డి. హరినాథ్ చౌదరి బహూకరించిన వాటర్ కూలర్లను కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి, టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి చేతుల మీదుగా ఆలయ కమిటీలకు గురువారం అందజేశారు.

ఫిష్ ఆంధ్రా హబ్‌ను సందర్శించిన జపనీస్ బృందం



ఆక్వా హబ్‌ను పరిశీలిస్తున్న జపనీస్ బృందం

కలిదిండి, ఏప్రిల్ 11 : కలిదిండిలో ఉన్న ఫిష్ ఆంధ్రా ఆక్వా హబ్‌ను జపనీస్ బృందం గురువారం సందర్శించి పరిశీలించారు. చేపలు, రొయ్యల క్రయ విక్రయాలను అడిగి తెలుసుకున్నారు. ఫంగస్ చేపల, రొయ్యల పెంపకంపై అధ్యయనం చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో పేరుగాంచిన కలిదిండి ఆంధ్రా ఆక్వా హబ్ సందర్శించి చేపలు, రొయ్యల ప్యాకింగ్ ఎగుమతులు, దిగుమతులు తదితర అంశాలను అధ్యయనం చేశామని జపనీస్ బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్, హబ్ యజమాని అబ్దుల్ ఖాన్, విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ధనబలం వారికే పార్టీ టిక్కెట్లు : ముద్దరబోయిన



ముద్దరబోయినకు మీర్జాపురం గ్రామస్థుల మద్దతు

నూజివీడు, ఏప్రిల్ 11: ప్రజా నాయకుల కన్నా ధనబలం ఉన్నవారికే ప్రస్తుతం పార్టీలు టిక్కెట్లు ఇస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం నూజివీడు పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించగా, అభిమానులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభిమానులు, కార్యకర్తల అండదండలతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నానన్నారు. మీర్జాపురానికి చెందిన పలువురు వైసీపీ, టీడీపీ నాయకులు మద్దతును తెలిపారు. గ్రామానికి చెందిన దండుబోయిన ప్రసాద్, కట్టా శివనాగరాజు, కొలుసు వెంకటేశ్వరరావు తదితర 50 కుటుంబాలకు చెందిన వారు మద్దతు తెలిపారు.

వైసీపీ పాలనలో జలవనరుల రంగం నిర్వీర్యం



నూజివీడు, ఏప్రిల్ 11: రాష్ట్రంలో జలవనరుల రంగాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సీనియర్ టీడీపీ నేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. గురువారం నూజివీడులో విలేకరులతో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో జలవనరుల రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చుచేసి 67 ప్రాజెక్టులు చేపట్టి, వాటిలో 23 ప్రాజెక్టులను పూర్తిచేసి 32 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించిందన్నారు. వైసీపీ హయాంలో గత ఐదేళ్లలో రూ.32 వేల కోట్లు ఖర్చుచేసి ఒక్క ఎకరం కూడా స్థిరీకరించకుండా జలవనరుల రంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. 2019 నుంచి 2024 వరకు నూజివీడు నియోజకవర్గంలో కుంటుపడిన అభివృద్ధిని సరిచేయాలంటే రానున్న ఎన్నికల్లో నూజివీడుతో పాటు రాష్ట్రంలో తెలుగుదేశం అభ్యర్థులు గెలుపొందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగురైతు మాజీ అధ్యక్షుడు చిట్నేని శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 11: జ్యోతిరావుపూలే జయంతి, రంజాన్ పండుగ పురస్కరించుకుని మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐయ్యంకి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్ సమీపాన చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా ఆర్టీవో లాం రాజశేఖర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జ్యోతి రావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. గత పదేళ్లుగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని సంస్థ అధ్యక్షుడు ఐయ్యంకి సురేష్‌బాబు తెలిపారు.



ఆగిరిపల్లిలో ముస్లింల ప్రార్థన.. రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కొలుసు నితిన్‌కృష్ణ, కలిదిండిలో మసీదుకు వెళ్తున్న ముస్లింలు.. చనుబండలో ప్రార్థనలు.. ముదినేపల్లిలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

మసీదుల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

కైకలూరు, ఏప్రిల్ 11: రంజాన్ సందర్భంగా ముస్లీంలు ఈద్గా దగ్గర గురువారం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. కైకలూరు చిన్న, పెద్ద మసీదుల నుంచి ముస్లీంలందరూ ర్యాలీగా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ముస్లింలతో పాటు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నెల రోజుల పాటు ఉపవాసదీక్షలు చేసి భక్తిశ్రద్ధలతో నమాజ్‌లలో పాల్గొనడం అల్లాహ్ వారికిచ్చిన వరమని కొనియాడారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ ఎంఏ రహీం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ, టీడీపీ మైనార్టీ నేతలు ఎండీ ఉస్మాన్, సయ్యద్ బాషీద్, ఎస్.జమీల్ అహ్మద్, బషీర్, గఫూర్, పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

- చాట్రాయి : మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సామూహిక ప్రార్ధనలలో మత గురువులు మహ్మద్ ప్రవక్త సందేశాలను వినిపించారు. ఇతర మతాలవారు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.
- ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలోని మసీదులో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి ఈద్-ఉల్-ఫితర్ జరుపుకున్నారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు కమిటీ చైర్మన్ షేక్ బాజీ, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు అల్లా భక్షు తదితర ముస్లిం పెద్దలు రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు.
- నూజివీడు టౌన్ : నూజివీడు పెద్ద మసీదు, చిన్న మసీదు తదితర మసీదుల నుంచి ముస్లిం సోదరులు ఈద్గావద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ నూజివీడు అభ్యర్థి కొలుసు పార్థసారథి కుమారుడు కొలుసు నితిన్‌కృష్ణ ఈద్గా వద్దకు చేరుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు.
- కలిదిండి : కలిదిండిలో ముస్లింలు ర్యాలీగా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మూల్లంక మసీదులో ముస్లీంలు ప్రార్థనలు చేశారు.
- ముసునూరు : ముసునూరు మండలంలో ముసునూరు, గుడిపాడు, గోపవరం, చెక్కపల్లి తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఈద్ ముబారక్ చెప్పుకుని ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. మత గురువులు రంజాన్ పర్వదినం విశిష్టతను వివరించారు. మధ్యాహ్నం నుంచి నూజివీడులో జరిగిన ప్రత్యేక ప్రార్ధనలకు ముస్లింలు తరలివెళ్లారు.
- ఆగిరిపల్లి : ఆగిరిపల్లిలోని ముస్లింసోదరులు జమియా మసీదు, మక్కా మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జమియా మసీదు పక్కన ఉన్న ఈద్గా వద్దకు భారీ సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



మండవల్లిలో మాట్లాడుతున్న విఠల్‌రావు, కామినేని, పిన్నమనేని.. కలిదిండిలో కూటమిలో చేరిన అమరావతి సర్పంచ్ భోగేశ్వరరావు.. వెంకటాపురంలో పార్థసారథి ప్రచారం.. వినోద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనం

మండవల్లి, ఏప్రిల్ 11: వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనమైందని, రాష్ట్రంలో జగన్, కైకలూరు ఎమ్మెల్యేగా దూలం నాగేశ్వరరావు పాలన విధానాన్ని విస్మరించి, రైడీయిజాన్ని చలాయిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, కైకలూరు ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు విమర్శలు చేశారు. మండవల్లిలో గురువారం జరిగిన ప్రత్యే కార్యక్రమంలో వైసీపీ పాలనపై వారు విమర్శలు చేశారు. గుడివాడ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి మాట్లాడుతూ ఆక్వా రైతులను నట్టింట్లో ముంచింది వైసీపీ ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జన సేన, బీజేపీ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, బొల్లంపల్లి కృష్ణారావు, గుడివా డ చిట్టిబాబు, గునిశెట్టి కుమార్, బండి రంగారావు, నారగాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భారీగా వైసీపీ నుంచి ఎన్డీయేలోకి చేరిక..

మండవల్లిలో భారీస్థాయిలో వైసీపీలో కీలక పాత్ర పోషించిన పలువురు నాయకులు గురువారం కామినేని సమక్షంలో ఎన్డీయేలో చేరారు. మండవల్లి మాజీ సర్పంచ్‌లు గుడివాడ చిట్టిబాబు, గొట్టుముక్కల సత్యనారాయణరాజు, మాజీ ఎంపీటీసీ గుడివాడ రాజేశ్వరి, మండవల్లి శివాలయం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ గుడివాడ బాలాజీ ఆధ్వర్యంలో సుమారు 300మంది వైసీపీ కార్యకర్తలు జనసేన, బీజేపీ ఎన్డీయే కూటమిలో చేరారు.

ఆక్వా రంగం నిర్వీర్యం : కామినేని

కలిదిండి, ఏప్రిల్ 11 : వైసీపీ ప్రభుత్వం ఆక్వా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కొండంగి, మట్టగుంట, పెదలంక, మూల్లంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆక్వా రంగానికి పెద్ద పీట వేయడంతో తలసరి ఆదాయంలో కలిదిండి మండలం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కొండంగి లాకుల వద్ద ఉప్పుటేరుపై రూ.13 కోట్లతో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసిన ఘనత తనదేనన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్‌చౌదరి, అంగ్రాజు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ రమాదేవి, నాయకులు భోగేశ్వరరావు, ఇమ్మానేని చంద్రశేఖర్, బండి తులసీరావు, సారిక వెంకటేశ్వరరావు, బోళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో భారీ చేరికలు

మండలంలో అమరావతి, కొండగి గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం కూటమి అభ్యర్థి కామనేని శ్రీనివాస్ సమక్షంలో చేరారు. అమరావతి సర్పంచ్ భోగేశ్వరరావు, నాయకులు దోణాద్రి స్వాములు, రాధాకృష్ణ, దొనకొండ శ్రీను తిరుపతిరావు, పెరుమాళ్ల సత్యనారాయణలకు, కొండంగిలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

వైసీపీ పాలనలో రైతుల సంక్షేమం శూన్యం : పార్థసారథి

ముసునూరు, ఏప్రిల్ 11: వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతుల సంక్షేమానికి చేసింది శూన్యమని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం సాయంత్రం బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మండలంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బలివే, వెంకటాపురం, వేల్పుచర్ల గ్రామాల్లో బారీ ర్యాలీతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇచ్చామని మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతుల ఆర్థికాభివృద్ధికి చేసిందేమి లేదని విమర్శించారు. తన విజయానికి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యతగా కృషిచేయాలని కోరారు.

ఈదులగూడెంలో ఆత్మీయ సమావేశం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 11: ఈదులగూడెం గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 11: సింగరాయపాలెంలో గురువారం టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ ఆధ్వర్యంలో ఓట్లను అభ్యర్థిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు కానుబోయిన నాంచారయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వినోద్ మాట్లాడుతూ అధికారపార్టీ ఎమ్మెల్యే అవలంబించిన ఏకపక్ష వైఖరి కారణంగా ఆ పార్టీ కార్యకర్తలు టీడీపీలో చేరారన్నారు. వాడవల్లి శివారు చిన్నవాడవల్లి గ్రామంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వీరంకి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి గురువారం కమలం పువ్వు, సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని ప్రచారం నిర్వహించారు.

ముదిరాజుల సంక్షేమానికి కృషి : కామినేని



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి కామినేని

కైకలూరు, ఏప్రిల్ 11: ముదిరాజుల సంక్షేమానికి ఎన్డీయే కూటమి కృషి చేస్తుందని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం తామరకొల్లులో నియోజక వర్గ ముదిరాజుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కామినేని మాట్లాడుతూ ముదిరాజులంతా ఐక్యతతో ఉండాలని, రానున్న రోజుల్లో వారు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పిడి కృష్ణమోహన్ మాట్లాడుతూ వైసీపీ ముదిరాజులను ఓటుబ్యాంకుగానే వాడుకుని వదిలేసినందు వల్ల కూటమిలో చేరుతున్నట్లు వెల్లడించారు. సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటరావు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పరసా సర్వేశ్వరరావు, పాము ధనలక్ష్మి, పరసా విజయకనకదుర్గ, రామకృష్ణ, రాణి, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాదరా జు, పోకల జోగిరాజు, ఎంపీటీసీ గంగుల వెంకటనరసమ్మ, బీజేపీ నేత సీఎల్ వెంకట్రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారాలు

రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించాలని మండలంలోని తామరకొల్లు, కొట్టాడ, జంగంపాడు, వడ్లకూటితిప్ప, కైకలూరు పట్టణంలో కూటమి అభ్యర్థులు కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌లను గెలిపించాలని కూటమి నాయకులు ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. కైకలూరు పట్టణంలో 7, 8వ వార్డులలో వార్డు సభ్యులతో కలిసి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తామరకొల్లులో పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగారు. కొల్లేరు గ్రామాలైన కొట్టాడ, జంగంపాడు గ్రామాలలో రాష్ట్ర వడ్డీసాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తామరకొల్లు ఎంపీటీసీ సభ్యురాలు గంగుల వెంకటనరసమ్మ, పోలవరపు లక్ష్మీరాణి, శీలం కృష్ణవేణి, టీడీపీ నాయకులు గంగుల ఏసురాజు, గంగుల పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.



తామరకొల్లులో ప్రచారం చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు. కైకలూరు ఎన్నికల ప్రచారంలో పీజేఎస్ మాల్యాద్రి

రామాలయంలో సినీ నిర్మాత నారాయణ పూజలు



నిర్మాత నారాయణను సత్కరిస్తున్న సభ్యులు

ముదినేపల్లి, ఏప్రిల్ 11:దుర్గాఆర్ట్స్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్.నారాయణ తన స్వగ్రామమైన పెదగొన్నూరు పంచాయతీ ఏరియాలోని విశ్వనాద్రిపాలెంలోని సీతారామాలయంలో గురువారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. సభ్యులు ఆధ్యాత్మికతతో వ్యవహరించి ఆలయ ప్రతిష్ఠను పెంచాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శాంతి కల్యాణం



శాంతి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 11: సింగరాయపాలెం, చేవూరుపాలెం సెంటర్ లో వున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం కృత్తిక నక్షత్రం సందర్భంగా స్వామికి శాంతికల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శాంతి కల్యాణంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీమతి నేలసంధ్య కల్యాణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



మట్టగుంటలో పూలే చిత్రపటం వద్ద బీసీ నాయకుల నివాళులు

కైకలూరు, ఏప్రిల్ 11:మహాత్మ జ్యోతిరావుపూలే ఆశయాలు మహోన్నతమైనవని కైకలూరు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కైకలూరు తాలుకా సెంటర్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగునేని వరప్రసాద్, పూల రామచంద్రరావు, పెన్మెత్స త్రినాథరాజు, కేవీఎస్ఎం నాయుడు, మోదుగుమూడి లక్ష్మయ్య, బొల్లా శ్యామలరాజుగౌడ్, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్ పాల్గొన్నారు.

- ముదినేపల్లి : ముదినేపల్లిలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద పూలే విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహ ఏర్పాటు కమిటీ గౌరవాధ్యక్షుడు పడమట వెంకటరమణ, అధ్యక్షుడు పళ్లెం పుణ్యేశ్వరరావు, కార్యదర్శి నిమ్మగడ్డ భిక్షాలు, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, నాయకులు ఈడే ఉమామహేశ్వరరావు, జన్ను వెంకటేశ్వరరావు తదితరులు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- మండవల్లి : జ్ఞానజ్యోతి జ్యోతిరావుపూలే అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి గౌరవ అధ్యక్షుడు సామాజిక కార్యకర్త ఎల్ఎస్ భాస్కరరావు, ఉపాధ్యక్షులు పాగోలు అభిష అన్నారు. మండవల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి వారి ఆధ్వర్యంలో పూలే జయంతి సందర్భంగా పూలే, సావిత్రిబాయి చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. కొండపల్లి రవిప్రసాద్, గోరింక గాంధీ, దాకరపు వినోద్‌కుమార్, వట్టిప్రోలు మహేష్, అలుగుల బాబి, దాకరపు సుహాస్ తదితరులు పాల్గొన్నారు.
- కలిదిండి : మట్టగుంటలో గురువారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం సలహాదారుడు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, నాయకులు నాగిడి వీరబ్రహ్మం, తిరుమాని గోపాలకృష్ణ, బళ్ల రాజు, పరశురాముడు, నరసింహ స్వామి, చిన్ని కృష్ణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- నూజివీడు టౌన్ :నూజివీడు పట్టణంలోని ముద్దరబోయిన కార్యాలయంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూజివీడు బీజేపీ కార్యాలయం, మాటూరి రవికాంత్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వసుంధరాదేవి పాల్గొన్నారు.
- చాట్రాయి : చిన్నంపేటలో ఉపాధిహామీ కూలీలు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, సామాజిక చైతన్య వేదిక మండల కన్వీనర్ ఈవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అణగారిన వర్గాల జీవితాలలో వెలుగులు రావాలంటే విద్య ద్వారానే సాధ్యమని నమ్మి ఎందరికో అక్షర జ్ఞానం ప్రసాదించిన మహనీయుడు పూలే అని కొనియాడారు. మహిళలకు విద్యను అందించాలని తన భార్యను తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తయారుచేసి మహిళా అక్షరాస్యతకు నాంది పలికారన్నారు.

కాల్వలకు నీటి విడుదల పెంచేందుకు కృషి

» ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ



ముదినేపల్లిలో పోల్‌రాజ్ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈ

ముదినేపల్లి, ఏప్రిల్ 11 : తాగునీటి అవసరాలకు మంచి నీటి చెరువులను నింపేందుకు కాల్వలకు నీటి విడుదల పెంచే విషయంలో చర్యలు తీసుకుంటున్నట్టు ఏలూరు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎల్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ త్రినాథబాబు, ఎంపీడీవో మురళీ గంగాధర్‌రావు, ఈవోపీఆర్‌డీ లక్ష్మీనారాయణతో కలసి ముదినేపల్లి మండలంలోని మంచినీటి చెరువులను, కాల్వలకు విడుదలైన నీటి వినియోగాన్ని పరిశీలించారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద పోల్ రాజ్, క్యాంప్ బెల్, బంటుమిల్లి ప్రధాన కాల్వలకు విడుదల చేసిన నీటి పరిమాణాన్ని పరిశీలించారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీరు చెరువులను నింపేందుకు సరిపోదన్న విషయాన్ని ఎస్ఈ గుర్తించారు. ఆయన మాట్లాడుతూ కాల్వలకు నీటి విడుదలను పెంచే విషయాన్ని ఇరిగేషన్ కృష్ణా తూర్పు డెల్టా ఎస్ఈ ప్రసాద్‌బాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలో 158 మంచినీటి చెరువులు ఉండగా, సుమారు 50 చెరువవులను నింపడం ప్రారంభించినట్టు తెలిపారు. కాల్వల శివారు ప్రాంతాల చెరువులను నింపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, నీటి అక్రమ వినియోగం జరుగకుండా నిఘా బృందాలు పని చేస్తున్నట్టు ఎస్ఈ తెలిపారు.

20 మంది వలంటీర్ల రాజీనామా

చాట్రాయి, ఏప్రిల్ 11: మండలంలోని ఆరుగొలనుపేట గ్రామ వలంటీర్లు ఎనిమిది మంది, జనార్దనవరంలో పన్నెండు మంది మొత్తం 20 మంది రాజీనామా పత్రాలను గురువారం ఎంపీడీవో మంగాకుమారికి అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాల వలంటీర్లు రాజీనామాలకు సిద్ధమవుతున్నారు.

పార్థసారథి విజయం కోరుతూ ప్రత్యేక పూజలు

నూజివీడు, ఏప్రిల్ 11: నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి మాజీ మంత్రి, టీడీపీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి సేవలు అవసరమని భావించి ఆయన విజయాన్ని కోరుతూ హనుమాన్‌జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి శేషవస్త్రాన్ని స్వామివారి చిత్రపటాన్ని గురువారం నూజివీడులో పార్థసారథి కార్యాలయంలో సారథికి రాష్ట్ర సాగు నీటి వినియోగదారుల సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణ అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగు రైతు మాజీ అధ్యక్షుడు చిట్నేని శివరామకృష్ణ, టీడీపీ నాయకులు తుమ్మల నాగేశ్వరరావు, మోరంపూడి శ్రీను తదితరులు ఉన్నారు.